
## వరంగల్ సభను సక్సెస్ చేయండి



కల్లూరులో పెయింటింగ్ వేస్తున్న శ్యాంసుందర్

కుంటాల, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్యాంసుందర్ కోరారు. కుంటాల మండలంలోని కల్లూరులో రజతోత్సవ సభ ప్రచారం కోసం వాల్ పెయింటింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పడకంటి దత్తు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దశరథ్ పెంటవార్, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రజనీకాంత్, రాకేశ్, రమేశ్, వంశీ, బొండా రవి, సతీశ్, సునీల్, నరేశ్, సుధీర్ పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో సాయిచైతన్య


జాదవ్ సాయిచైతన్య

# పట్టువదలని విక్రమార్కుడు

- నాలుగో ప్రయత్నంలో తన లక్ష్యాన్ని చేరిన గిరిజన బిడ్డ
- సివిల్ సర్వీసెస్‌లో 68వ ర్యాంకు సాధించిన సాయి చైతన్య
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘాలు

ఉట్నూర్, ఏప్రిల్ 22 : సివిల్ సర్వీసెస్ మెయిన్స్‌లో 68వ ర్యాంకు సాధించి సాయి చైతన్య శభాష్ అనిపించుకుంటున్నాడు. ఇప్పటివరకు మూడు సార్లు మెయిన్స్‌కు వెళ్లాడు. ప్రయత్నాన్ని వదలకుండా మళ్లీ ప్రయత్నించి సివిల్స్ సాధించాడు. వివరాలిలా ఉన్నాయి.

తలమడుగు మండలంలోని పల్సి(బీ) తండాకు చెందిన జాదవ్ గోవింద్‌రావు-కవిత దంపతుల కుమారుడు సాయి చైతన్య, శృతి ఇద్దరు సంతానం. గోవింద్‌రావు హెడ్ కానిస్టేబుల్, కవిత ఉపాధ్యాయురాలిగా ఉట్నూర్ ప్రాంతంలో నివాసముంటున్నారు. శృతి ఎంబీబీఎస్ సాధించి వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నది. అయితే సాయి చైతన్య చిన్నతనం నుంచే విద్యలో రాణిస్తున్నాడు. ఉట్నూర్ లిటిల్ ఫ్లవర్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించిన సాయిచైతన్య అనంతరం నవోదయ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. హైదరాబాద్‌లో ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో చదివి ప్రతిభ కనబర్చాడు. అనంతరం ఐఐటీ తిరుచ్చి నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్ పూర్తి చేశాడు. అప్పటి నుంచే ఐఏఎస్ కావాలన్న తన లక్ష్యం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాడు. యూపీఎస్సీ పరీక్షలపై దృష్టి సారించి రెండు ప్రయత్నాలలో ఇంటర్వ్యూ వరకు వెళ్లి విఫలమైన మూడో ప్రయత్నంలో అఖిల భారత స్థాయిలో 131వ ర్యాంక్ సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు. కానీ.. తన లక్ష్యం సివిల్స్ కోసం కృషి చేసి చివరకు 68వ ర్యాంకు సాధించాడు. ఏజెన్సీ ప్రాంతం నుంచి సివిల్స్‌లో ర్యాంక్ సాధించడంతో గిరిజన సంఘాలు, కుటుంబీకులు సాయిచైతన్యను అభినందిస్తున్నారు.

### నాలుగో ప్రయత్నంలో విజయం

తన సివిల్స్ లక్ష్యం కోసం సాయిచైతన్య నాలుగో ప్రయత్నంలో విజయం సాధించారు. బీటెక్ పూర్తిచేసిన అనంతరం యూపీఎస్సీ పరీక్షలపై దృష్టి సారించాడు. మొదటి సారి 13 మార్కులు, రెండోసారి 10 మార్కులతో ఐఏఎస్ చేజారిన పట్టు వదలని విక్రమార్కుడిలా ముందుకు సాగాడు. మూడోసారి యూపీఎస్సీ పరీక్షలలో 131వ ర్యాంకు రావడంతో ఐఎఫ్ఎస్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయిన మరోసారి సివిల్స్ ఇంటర్వ్యూ పూర్తిచేసి 2024 సంవత్సరం ఫలితాలలో 68వ ర్యాంకు సాధించి మొత్తానికి తన కళను నెరవేర్చుకున్నాడు.



# బాలికలదే పైచేయి

## ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదల

- ప్రథమ సంవత్సరంలో 17, ద్వితీయలో 10 స్థానం
- రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలే పైచేయిగా నిలిచారు. జనరల్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 58.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 2,421 మంది హాజరు కాగా.. 1,054 మంది (43.54 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 3,062 మందికి 2,169(70.84 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఓవరాల్‌గా 5,483 మందికి 3,223(58.78 శాతం) మంది ఉత్తీర్ణులు అయ్యారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో నిర్మల్ జిల్లా 17వ స్థానంలో నిలిచిందని డీఐఈవో పరుశరాం తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలురు 2,342 మందికి 1,371(54.31 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 2,869 మందికి 2,322(80.93 శాతం) మంది ఉత్తీర్ణులు అయ్యారు. ఇందులో బాలురు, బాలికలు కలిపి 5,211 మందికి 3,698(70.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచారు. ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరంలో బాలురు 575 మందికి 192(33.39 శాతం), బాలికలు 513 మందికి 338(65.89 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఓవరాల్‌గా 1,088 మందికి 530(48.71 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 436 మందికి 226(51.83 శాతం) మంది.. బాలికలు 416 మందికి 349(83.89 శాతం) మంది పాస్ అయ్యారు. ఓవరాల్‌గా 852 మంది విద్యార్థులకు 575(67.49 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

### గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డానియల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో రెంక సుప్రియ 992, అవంతిక 991, అక్షయ 989, సిందూర 988.. బైపీసీ విభాగంలో అంజలి 993, అన్విత 986, శ్రీనిధి 982 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో అక్షయ 435, విజయలక్ష్మీ 433, కీర్తన 433, ఎంపీసీలో షర్వాణి 465, శ్రీవల్లి 465, సంధ్యారాణి 464, వర్షిణి 464, కీర్తన 463 మార్కులు సాధించారు.

### ఆదిలాబాద్ జిల్లా మెరుగైన స్థానం

ఎదులాపురం, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియెట్ ఫలితాలు మంగళవారం మధ్యాహ్నం విడుదల య్యాయి. మార్చి 5 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో ఫలితాలను డీఐఈవో గణేశ్ రాథోడ్ వెల్లడించారు. ప్రథమ సంవత్సరంలో 9,106 మంది పరీక్షలు రాయగా.. 4,967 మంది (54.55 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 8,890 మంది పరీక్షలు రాయగా.. 6,291 మంది (70.76 శాతం) పాస్ అయ్యారు. కాగా.. ఆదిలాబాద్ జిల్లా మొదటి సంవత్సరంలో 27వ స్థానం, రెండో సంవత్సరంలో 12వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో మెరుగైన స్థానం రావడంలో జూనియర్ లెక్చర్ల సంఘం ఆధ్వర్యంలో డీఐఈవోను సత్కరించి స్వీట్లు తినిపించారు. ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైనందునే అత్యధికంగా ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పేపర్ రీ-వ్యాల్యుయేషన్‌కు వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 22వ తేదీన సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించుకోవాలన్నారు.

# రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలి

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 22 ః ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ, సిరికొండ మండలాల కేంద్రాల్లోని మార్కెట్ యార్డుల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు రైతుల తరపున నిలబడి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శారద కోటేశ్, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మాజీ సర్పంచ్ పెంటన్న, కో-ఆప్షన్ సభ్యులు ఎక్బల్, శ్రీసంపద సొసైటీ చైర్మన్ ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.


సిరికొండలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


నిర్మానుష్యంగా మారిన తెలంగాణ చౌక్

# రెడ్ అలర్ట్

- భానుడి ప్రచండ ప్రతాపం
- వాతావరణ శాఖ హెచ్చరిక
- నేటి నుంచి మూడు రోజులు 45 డిగ్రీలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ) : భానుడు తన ప్రతాపం చూపుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఆదిలాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. నేటి(బుధవారం) నుంచి మూడు రోజులపాటు రెడ్ అలర్ట్ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, వడగాలులు వీస్తాయని వృద్ధులు, పిల్లలు బయట తిరగొద్దని వాతావరణ శాఖ సూచించింది. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో మంగళవారం 44డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుంది. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేడి నుంచి రక్షణ, ఉపశమనం పొందడానికి టోపీలు, గొడుగులు వాడుతున్నారు. చల్లటి పానియాలు తాగుతున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రజలు బయట రావద్దని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# భారీగా ప్రజలను సమీకరించాలి

## మాజీ మంత్రి జోగు రామన్న

భైంసా, ఏప్రిల్ 22 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా జన సమీకరణ చేపట్టి విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల ఆశయాలకు అంకితమై పనిచేస్తున్నదన్నారు. రాబోయే రజతోత్సవ మహాసభ కార్యకర్తలకు పండుగలా మారనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి సభను విజయవంతం చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనదైన శైలిలో పదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించి బంగారు తెలంగాణగా తయారు చేశారన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ నియోజకవర్గ నాయకులు రాంకిషన్‌రెడ్డి, ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు పడకంటి రమాదేవి, విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, సురేశ్, రావుల పోశెట్టి, వాసే పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# జొన్నల కొనుగోళ్లు ప్రారంభం

- 'నమస్తే'కు స్పందన

ఆదిలాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నల విక్రయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో 'మంత్రి ప్రారంభించినా పడిగాపులే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం అధికారులు జొన్నల కొనుగోళ్లను ప్రారంభించారు. సోమవారం ఉదయం నుంచి రైతులు పంటను విక్రయానికి తీసుకొచ్చారు. పంట సేకరణలో భాగంగా ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం మార్కెట్ యార్డు పరిధిలోని గ్రామాల రైతుల పంటను సేకరిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మద్దతు ధర క్వింటాలుకు రూ.3371 పంట సేకరణ జరుగుతుండగా.. సిబ్బంది నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేశారు. అమ్మకానికి తీసుకొచ్చిన జొన్నలతో మార్కెట్ యార్డులోని షెడ్డులు నిండిపోగా.. ఆరు బయట పోశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎకరాకు 14 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పీఏసీఎస్ సిబ్బంది తెలిపారు.


ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్నల నాణ్యతను పరిశీలిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

# కీచక టీచర్ అరెస్టు

ఎదులాపురం, ఏప్రిల్ 22 : విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగికంగా వేధించిన పీఈటీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం వివరాలను వెల్లడించారు. మావల మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో పీఈటీగా గుండి మహేశ్(54) విధులు నిర్వర్తిస్తున్నాడు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు. విద్యార్థుల, యోగా టీచర్ శరీర భాగాలను ముడుతూ శారీరకంగా వేధించేవాడు. యోగా టీచర్, విద్యార్థినులు షీ టీంకు ఫిర్యాదు చేయడంతో మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోక్సో సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. అత్యవసర సమయంలో షీ టీం బృందాలను 87126 59953 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

2023లో నాటిన మొక్కలు



2025లో వృక్షాలు



# నాటి మొక్కలే.. నేటి వృక్షాలు

కేసీఆర్ సర్కారు హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొక్కలు నాటింది. పదేండ్ల పాలనతో వందల కోట్ల మొక్కలు నాటగా అవి చెట్లుగా పెరిగాయి. మండుటెండలో బాటసారులకు నీడనిస్తూ ఆహ్లాదపరుస్తున్నాయి. కోతులకు ఆహారాన్ని అందిస్తున్నాయి. కాగా.. ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో జూలై 3, 2023న కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఐదు వేల మొక్కలు నాటారు. వాటికి రక్షణగా చీరెలను పెట్టారు. అవి ఇంతింతై వటుడింతై అన్నట్లు ఏపుగా పెరిగాయి. నాటి మొక్కలు, నేటి చెట్లను 'నమస్తే' క్లిక్ మనిపించింది.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ.

# మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ఎదులాపురం, ఏప్రిల్ 22 : వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో మైనర్లు వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్‌లో ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. బి సేఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్‌లో ట్రాఫిక్ నియమాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు బయటకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు హెల్మెట్ ధరించే విధంగా ప్రోత్సహించాలన్నారు. సెల్ ఫోన్ ద్వారా మాట్లాడుతూ వాహనాన్ని నడపకుండా ఉండాలని తెలియజేయాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమాలను తెలిపేలా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రణయ్ కుమార్, బీసేఫ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ గన్ శామ్ ఓజా, సభ్యులు మహిపాల్ రెడ్డి, అమూల్ ఓజా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్